AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

11-10-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2

'అమ్మ'ను కొలిచే వేళాయే..



2



2

స్తంభం పై కేబుల్ టీవీ లైన్‌మన్‌కు కరెంట్ షాక్

రెడ్‌క్రాస్ చైర్మన్, కోశాధికారికి సన్మానం



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నూతన మేనేజింగ్ కమిటీ చైర్మన్ పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, కోశాధికారి కెంపుల నాగరాజును అఖిల భారత విశ్వబ్రాహ్మణ మహాసభ జిల్లా శాఖ సభ్యులు ఘనంగా సన్మానించారు. అధ్యక్షురాలు మడుపు స్వప్న మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి లక్ష్మి, విజయ, కోశాధికారి లత, వర్కింగ్ ప్రెసిడెంట్ కవిత, ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి, కార్యవర్గ సభ్యులు లత, చంద్రకళ, ముఖ్య సలహాదారు గీత, సదానందం తదితరులు పాల్గొన్నారు.



ప్రజాస్వామ్యం ముసుగులో కాంగ్రెస్ పచ్చి అబద్ధాలు

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందంటూ కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు పచ్చి అబద్ధాలు ఆడుతున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి అన్నారు. దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియ జరిగిన రాష్ట్రాల్లో ఓటర్లకు సుమారు ఐదు నెలల వరకు సమయం కల్పించారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష పార్టీలు మాత్రం ఎస్ఐఆర్‌తో ప్రజాస్వామ్యం కూలిపోతుందని గగ్గోలు పెడుతున్నారన్నారు. దేశంలోని మొత్తం 95 కోట్ల మంది ఓటర్లలో 82 కోట్ల మంది స్వచ్ఛందంగా ఎన్యూమరేషన్ ఫారమ్ పూర్తి చేసి బాధ్యతాయుతమైన పౌరులుగా నిలిచారన్నారు. ఇంతటి భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొంటే.. ఈ 82 కోట్ల మందిని కాంగ్రెస్ అవమానిస్తోందన్నారు. గత ఆర్నెళ్లలో దేశవ్యాప్తంగా దాదాపు 2 కోట్ల మంది ఫామ్6 ద్వారా కొత్తగా ఓటు నమోదు చేసుకున్నారని దినేష్ పేర్కొన్నారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటునూ ఎన్నికల సంఘం తొలగించలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇంట్లో, పీసీసీ చీఫ్ ఇంట్లో ఏ ఒక్కరిదైనా ఓటు గల్లంతైందా అని ప్రశ్నించారు. 2014 నుంచి ప్రధాని మోదీ చేపట్టిన చారిత్రాత్మక సంస్కరణలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల నుండి ప్రజల దృష్టిని మళ్లించడమే ప్రతిపక్షాలు నాటకాలు ఆడుతున్నాయని దినేష్ ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గోపిడి ప్రవంతిరెడ్డి, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, నాయకులు కల్పె చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



నామినేటెడ్ పదవుల్లో ముదిరాజ్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలి

అక్షరటుడే, ఎల్లారెడ్డి : నామినేటెడ్ పదవుల్లో ముదిరాజ్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు బట్టు విఠల్ అన్నారు. పట్టణంలో ఆదివారం ఎల్లారెడ్డి ముదిరాజ్ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు దుద్దుల సాయిరాం అధ్యక్షతన ముదిరాజ్ సంఘం సభ్యులు సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ముదిరాజ్‌లను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. తమకు నామినేటెడ్ పోస్టుల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో అధిక జనాభా కలిగిన ముదిరాజ్ సామాజిక వర్గానికి నామినేటెడ్ పదవులు ఇవ్వడంలో రాజకీయ పార్టీలు అలసత్వం వహిస్తున్నాయని విమర్శించారు. ఈ సమావేశంలో సొసైటీ మాజీ చైర్మన్ ఎగుల నర్సింలు, జక్కుల సంతోష్ కుమార్, మర్రి బాలకిషన్, మర్రి ప్రకాష్, గంట సాయిలు, భాస్కర్, ప్రవీణ్, క్యాస కిష్టయ్య, కన్నెబోయిన రాజు, గొనె మహేందర్, జక్కుల అశోక్, పరంధాములు, సాయిలు, నీల రవి పాల్గొన్నారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఏటీఎం దొంగల ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. జిల్లా సరిహద్దులు కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు ఆనుకుని ఉండటంతో ఇతర రాష్ట్రాలకు చెందిన ముఠాలు సులభంగా వచ్చి చోరీలకు పాల్పడి పరారవుతున్నాయి. గత ఏడాది కాలంగా జిల్లాలో నమోదైన చోరీలను పరిశీలిస్తే ఇదే అర్థమవుతోంది.

- అక్షరటుడే, కామారెడ్డి



రెచ్చిపోతున్న ఏటీఎం దొంగలు

- గ్యాస్ కట్టర్ సాయంతో ఏటీఎం మిషన్లు కట్‌చేస్తున్న వైనం
- రూ.లక్షల్లో నగదు చోరీ
- ఏటీఎంల వద్ద ఏమార్చి నగదు అపహరణ
- కట్టడి చేయడంలో బ్యాంకర్లు, పోలీసుల విఫలం

దొంగలు వినూత్న రీతిలో చోరీలు చేస్తున్నారు. గ్యాస్ కట్టర్ ఉపయోగిస్తూ ఏటీఎంలు ధ్వంసం చేస్తున్నారు. డబ్బులు రాకపోతే ఏకంగా మిషన్లనే ఎత్తుకెళ్తున్నారు. గత రెండేళ్లలో జరుగుతున్న ఘటనలో రూ.లక్షల్లో దుండగులు కొల్లగొట్టిన ఘటనలు ఉన్నాయి. వరుస ఘటనలతో ఏటీఎంల వద్ద నిఘాపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గ్యాస్ కట్టర్ సాయంతో..

దొంగలు ఇప్పుడు కొత్త పంథాను ఎంచుకున్నారు. ఏటీఎం మిషన్‌ను పగలగొట్టేందుకు గ్యాస్ కట్టర్లను వాడుతున్నారు. గతేడాది జనవరి 12న బిచ్కుంద మండల కేంద్రంలో తెల్లవారుజామున వచ్చిన నలుగురు దుండగులు ఏటీఎం కేంద్రంలోకి చొరబడి ఏకంగా రూ.3.95 లక్షల నగదుతో సహా ఏటీఎం మిషన్‌నే వాహనంలో ఎత్తుకెళ్లారు. అదే రోజు పిట్లం మండల కేంద్రంలోని ఎస్బీఐ ఏటీఎంలో మరో ముఠా చోరీకి పాల్పడింది. ఏటీఎం లోపల ఉన్న సీసీటీవీ కెమెరాపై స్ప్రే కొట్టి, గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను కట్ చేసి రూ.17 లక్షలు దోచుకెళ్లారు. తాజాగా గాంధారి మండల కేంద్రంలో శనివారం అర్ధరాత్రి 1.21 గంటలకు స్కార్పియో వాహనంలో వచ్చిన దుండగులు పోలీసుల కళ్లుగప్పేందుకు నైటీలు వేసుకుని వచ్చారు. గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను కట్ చేసి అందులో నగదు ఉన్న బాక్సులను ఎత్తుకెళ్లారు.

రూ. లక్షల్లో నగదు మాయం

జిల్లాలో జరుగుతున్న ప్రతి చోరీ లక్షల్లోనే ఉంటోంది. గతేడాది డిసెంబర్ 27న నిజామాబాద్ నగరంలోని ఆర్యనగర్‌లో దొంగలు బరితెగించారు. ఒకే రోజు.. కేవలం 20 నిమిషాల వ్యవధిలో ఎస్బీఐ, డీసీసీబీ బ్యాంకులకు చెందిన రెండు ఏటీఎంలను లక్ష్యంగా చేసుకున్నారు. ఈ రెండు చోట్ల కలిపి సుమారు రూ.40 లక్షల వరకు దోచుకెళ్లారు. ఈ ఘటనలో దొంగలు ఫేక్ నంబర్ ప్లేట్ ఉన్న కారులో వచ్చి, మాస్కులు ధరించి చోరీకి పాల్పడ్డారని పోలీసుల విచారణలో తేలింది.

ఏటీఎం కార్డులు మార్చి నగదు అపహరణ

పెద్ద మొత్తంలో దోపిడీలే కాకుండా, ఏటీఎం కేంద్రాల వద్దకు వచ్చే అమాయక ప్రజలను మోసం చేసి నగదు కాజేసే ఘటనలు కూడా పెరిగాయి. కామారెడ్డి పట్టణంలో డబ్బులు డ్రా చేసేందుకు వచ్చిన ఓ వ్యక్తికి సాయం చేసే నెపంతో అతని కార్డును మార్చి, అతని ఖాతా నుంచి రూ.40 వేలు కాజేశారు. ఇదే తరహాలో మాచారెడ్డి మండలంలో ఓ రైతు ఏటీఎంకు వెళ్లగా, అక్కడే మాటు వేసిన దుండగులు రైతు కార్డును కొట్టేసి, ఇతర ప్రాంతాల్లో నగదు డ్రా చేశారు. దీంతో బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గతంలో కామారెడ్డిలోని యాక్సిస్ బ్యాంక్ ఏటీఎంలో రిపేర్ చేయడానికి వచ్చామని చెప్పి ఓ వ్యక్తి నుంచి రూ.50 వేలు కాజేసిన ఘటన కూడా ఉంది.

కట్టడి చేయడంలో విఫలం

జిల్లాలో వరుస చోరీలు జరుగుతున్నా బ్యాంకర్లు, పోలీసులు కట్టడి చేయడంలో పూర్తిగా విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని చాలా ఏటీఎం కేంద్రాల వద్ద సెక్యూరిటీ గార్డులు లేరు. ఉన్నా కూడా రాత్రి వేళల్లో ఉండటం లేదు. సీసీటీవీ కెమెరాలు చాలా చోట్ల పనిచేయడం లేదు. అలారం వ్యవస్థలు కూడా నిర్వీర్యంగా మారాయి. రాత్రి వేళల్లో పోలీసుల గస్తీ కూడా సరిగా లేకపోవడంతో దొంగలకు ఇది వరంగా మారిందన్న ప్రచారం సాగుతోంది. చోరీ జరిగిన తర్వాత హడావుడిగా క్లూస్ టీమ్‌తో విచారణ చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప, ముందస్తు చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దుబాయిలో బతుకమ్మల వేడుకలకు బీఆర్ఎస్ నాయకులు



అక్షరటుడే, ఎల్లారెడ్డి: దుబాయిలో ఈటీసీఏ, జీటీఏఫ్ ఆధ్వర్యంలో జరగనున్న బతుకమ్మ వేడుకలకు బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, జీవన్ రెడ్డి, బిగాల గణేష్ గుప్తా హాజరుకానున్నారు. బతుకమ్మను విదేశాల్లోనూ ఘనంగా నిర్వహించడం ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, జానపద వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పే అవకాశం కలుగుతోందని ఈ సందర్భంగా వారన్నారు.

అక్క బతికుండగానే మృతి చెందిందని భూమి రిజిస్ట్రేషన్


అక్షరటుడే, గాంధారి: మానవత విలువలు రోజురోజుకు దిగజారుతున్నాయి. ఆస్తికోసం తన సొంత అక్క బతికుండగానే ఆమె చనిపోయిందని పేర్కొంటూ ఓ చెల్లి తండ్రి ఆస్తిని తన పేరున రిజిస్ట్రేషన్ చేయించుకుంది. ఈ ఘటన గాంధారి మండలకేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గాంధారి మండల కేంద్రానికి చెందిన బెస్త బాలవ్వ, బెస్త బాలయ్యలకు ఇద్దరు ఆడపిల్లలు గంగమణి, సావిత్రి, ఒక మగ సంతానం ఉన్నారు. అయితే బాలవ్వ, బాలయ్య ఇద్దరు మృతి చెందగా.. కొన్నిరోజులుగా ఆడపిల్లల అన్న కూడా మృతి చెందాడు. అయితే బాలవ్వ పేరుతో ఉన్న 10గుంటల భూమిని ఎలాగైన చేజిక్కించుకోవాలనే ఆశతో గంగమణి భర్త పన్నాగం పన్నాడు. సావిత్రి మృతి చెందిందని పేర్కొంటూ ఈ 10గుంటల భూమిని గంగమణి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించాడు. ఇది 2018లో జరుగగా తాజాగా బయటకు వచ్చింది. దీంతో సావిత్రి తనకు న్యాయం చేయాలని తహశీల్దార్, పోలీసులకు సావిత్రి ఫిర్యాదు చేసింది.



కీళ్లలో నొప్పులపై అశ్రద్ధ వద్దు

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: కీళ్ల నొప్పులపై అశ్రద్ధ చేయవద్దని మెడికవర్ ఆస్పత్రి ఆర్థోపెడిక్ సర్జన్లు మణిదీప్ రెడ్డి, దీపక్ పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవం సందర్భంగా ఆస్పత్రిలో కీళ్ల వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యులు మాట్లాడుతూ, ఆర్థరైటిస్ అనేది కీళ్లలో నొప్పి, వాపు, బిగుతుదనం, కదలికల్లో ఇబ్బందులకు కారణమయ్యే వ్యాధి అని తెలిపారు. వయస్సు పెరగడం, అధిక బరువు, కొన్ని రకాల కీళ్ల వ్యాధుల కారణంగా ఈ సమస్యలు తలెత్తవచ్చని వివరించారు. కీళ్ల నొప్పులను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదించాలని డాక్టర్ మణిదీప్ రెడ్డి సూచించారు. సరైన సమయంలో వ్యాధిని గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా నొప్పిని తగ్గించుకోవడంతో పాటు కీళ్ల పనితీరును మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. వైద్యుడు దీపక్ మాట్లాడుతూ, కీళ్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి క్రమం తప్పకుండా తగిన వ్యాయామం చేయడం, శరీర బరువును నియంత్రణలో ఉంచుకోవడం, సమతుల ఆహారం తీసుకోవడం, వైద్యుల సూచనలను పాటించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.

తులం బంగారం ఇవ్వాల్సిందే : ఎమ్మెల్యే ధన్‌పాల్



అక్షరటుడే, ఇందూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం తులం బంగారం ఇవ్వాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో ఆదివారం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్యాణ లక్ష్మి పథకంపై ప్రజల్లో అనేక సందేహాలు ఉన్నాయని, పథకం నిలిపివేస్తారనే పుకార్లు వస్తున్నాయన్నారు. దీనిపై అధికారులు, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు స్పష్టత ఇవ్వాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తుందని, కనీసం హామీ ఇచ్చిన సమయంలో ఉన్న ధరకే బంగారం ఇవ్వాలన్నారు. అలాగే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు నమోదు చేసుకున్న లబ్ధిదారులకు తొందరగా అందజేయాలని సూచించారు. మొత్తం 275 మంది లబ్ధిదారులకు 2.75 కోట్ల విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నుడా చైర్మన్ కేశ వేణు, బీజేపీ కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, మఠం పవన్, జగదీష్ కులకర్ణి, న్యాలం సునీత రాజు, బంటు ప్రీతి ప్రవీణ్, ఇప్ప కాయల సుమిత్ర కిషోర్, నాయకులు పంచరెడ్డి శ్యామ్, పవన్ ముందడ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలు కేసీఆర్‌ను ఎప్పటికి మర్చిపోరు

అక్షరటుడే, కామారెడ్డి: కామారెడ్డిని జిల్లాగా మార్చి అభివృద్ధికి బాటలు వేసిన కేసీఆర్‌ను జిల్లా ప్రజలు ఎప్పటికి మర్చిపోరని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. కామారెడ్డి జిల్లా ఏర్పడి పదేళ్లు అయిన సందర్భంగా దశాబ్ది ఉత్సవాలను తన నివాసం వద్ద నిర్వహించారు. ఉత్సవాలకు జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే సహా కామారెడ్డి నియోజకవర్గంలోని తెలంగాణ ఉద్యమకారులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్దఎత్తున హాజరయ్యారు. ఉద్యమకారులను మాజీ ఎమ్మెల్యేలు సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. గంప గోవర్ధన్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత చిన్న జిల్లాలతో అభివృద్ధి వేగంగా జరుగుతుందని దూరదృష్టితో ఆలోచన చేసి కొత్త జిల్లాలను ఏర్పాటు చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజలకు పాలన చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారని, కేసీఆర్ ఒక విజన్ ఉన్న నాయకుడని కొనియాడారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో సబ్బండ వర్గాలు ఇబ్బందుల్లో ఉన్నాయన్నారు. కరెంట్, యూరియా కోసం రైతులు అల్లాడుతున్నారని, 10, 15 రోజుల్లో పంటలు కోతకు వస్తాయని, కరెంట్ సమస్యతో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. తెలంగాణలో ధూందాం అనే పదం పుట్టినదే కామారెడ్డిలో అని గుర్తు చేశారు. అలాంటి కామారెడ్డిలో 14సార్లు ఓటమి ఎరుగని కేసీఆర్ ఓటమి పాలవడం దురదృష్టకరమన్నారు. ఈ ఓటమి కామారెడ్డికి తీరని మచ్చగా మిగిలిందని, అది తొలగిపోయేలా ప్రతి కార్యకర్త పని చేయాలని సూచించారు. పదేళ్ల పాటు పార్టీలో పదవులు అనుభవించి పార్టీ మారిన ద్రోహులను తన వద్దకు తిరిగి రానిస్తానని కార్యకర్తలు, ఉద్యమకారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని, ఆ



విషయంలో ఎలాంటి అనుమానాలు, భయాలు వద్దన్నారు. వారిని ఎప్పటికి తన వద్దకు రానిచ్చేది లేదని స్పష్టం చేశారు. కామారెడ్డిని కొత్త జిల్లాగా ప్రకటించి జిల్లాను ప్రగతి పథంలో నడిపించే అవకాశం కేసీఆర్ కల్పించారని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. తన నియోజకవర్గంలో 102 ఉన్న జీపీలు 168 గా మారాయని, కొత్తగా మూడు మండలాలు ఏర్పాటయ్యాయని, జిల్లాలో డివిజన్లను ఏర్పాటు చేశారన్నారు. తొమ్మిదిన్నరేళ్ల పాలనలో కేసీఆర్ సీఎం ఉన్నప్పుడు తెలంగాణ ప్రభుత్వంలా అనిపించిందని, ఇప్పుడు రేవంత్ రెడ్డి పాలనలో ఆంధ్ర ప్రభుత్వంలో ఉన్నట్టుగా ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నిధులు ఎక్కడికి తీసుకుని వెళ్తున్నారో తెలియడం లేదన్నారు.

అక్షరటుడే
TOWARDS... TRUTH. TRUST. TREND

2

నిజామాబాద్/కామారెడ్డి
ఆదివారం
11.10.2026

www.aksharatoday.in
AKSHARA TODAY

మధుకర్ జీని కలిసిన పైడి ఎల్లారెడ్డి



అక్షరటుడే, ఎల్లారెడ్డి : రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో తెలంగాణ బీజేపీ ఆర్గనైజేషన్ జనరల్ సెక్రెటరీ మధుకర్ జీని డా. పైడి ఎల్లారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో బీజేపీని మరింత బలోపేతం చేయడం, పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయడం, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేయడంపై చర్చించారు. కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మరింత చేరువ కావడం వంటి అంశాలపై మాట్లాడారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని బలోపేతం చేసే దిశగా సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరంపై దిశానిర్దేశం చేసుకున్నారు.

30 వసంతాల అనంతరం.. ఒక్కచోట కలిసిన వేళ




అక్షరటుడే, బాన్సువాడ : మూడు దశాబ్దాల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థులు.. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు.. నాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఒకే వేదికపై కలుసుకున్న వేళ బాన్సువాడలో ఆత్మీయత వెల్లివిరిసింది. శ్రీనివాస ట్యుటోరియల్ పాఠశాల 1996-1997 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు 30 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. మూడు దశాబ్దాల తర్వాత తాము చదువుకున్న విద్యాసంస్థలోనే మళ్లీ కలుసుకోవడంతో పూర్వ విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. నాటి స్నేహాలు, తరగతి గది అనుభవాలు, ఉపాధ్యాయుల బోధనలు, విద్యార్థి దశలోని మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నరేష్, గౌస్, సుధాకర్, శ్రీరామ్, శంకర్, నర్సింగ్ రావు, షేక్ సలాం, పుష్పలత, సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

నిరసనకారులను బేషరతుగా విడుదల చేయాలి



అక్షరటుడే,నిజామాబాద్‌సిటీ: నిరసనకారులను బేషరతుగా విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. నగరంలోని రైల్వే స్టేషన్ వద్ద శాంతియుతంగా నిరసన తెలిపారు. 'సర్'ను రద్దు చేయాలని, సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జంతర్ మంతర్ వద్ద నిరసన తెలియజేయడానికి వెళ్తున్న ఆయా పార్టీల నాయకులపై పోలీసులు దాడులు చేయడం అమానుషమన్నారు. వారిని అన్యాయంగా అదుపులోకి తీసుకున్నారనని వెంటనే వారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.ఓమయ్య, సీపీఐ జిల్లా నాయకులు వై.రాజిరెడ్డి, రఘురాం, రంజిత్, అలీ ఇమ్రాన్, కుశాల్ తదితరులు పాల్గొన్నారు.





‘అమ్మ’ను కొలిచే వేళాయే..


భక్తితో దుర్గమ్మను కొలిస్తే ఆ తల్లి కరుణతో మన జీవితాన్నే మారుస్తుందని భక్తుల అచంచల విశ్వాసం. ఉమ్మడిజిల్లాలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. దుర్గామాత ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు మాలధారణ చేశారు. నవరాత్రుల్లో భాగంగా మండపాలను తీర్చిదిద్దిన భక్తులు ఆదివారం నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

– అక్షరటుడే, నెట్‌వర్క్















హనుమాన్ ఆలయ ఆవరణలో స్వచ్ఛ భారత్

అక్షరటుడే, ఆర్మూర్ : పట్టణంలోని దోబీ ఘాట్ వద్ద జ్యోతిర్లింగ ఆశ్రమంలో హనుమాన్ ఆలయం ఆవరణలో ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. హనుమాన్ ఆలయం ఆవరణలో ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలు, పిచ్చిమొక్కలు, చెత్త చెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ఆలయ పూజారి మధుకర్ బాలాజీ మహారాజ్ మాట్లాడుతూ.. హనుమాన్ ఆలయంలో ఇలాంటి స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, బి ప్రశాంత్, రమేష్, నూక్కల ఆదిత్య, డ్రైవింగ్ వేణు, బట్టు సుమన్ ఖుషి వర్ధన్, సుంకే నిశాంత్ పాల్గొన్నారు.



బలప్రయోగంతో ప్రజల గొంతులను నొక్కలేరు

అక్షరటుడే, నిజామాబాద్ : కేంద్రంలో మోదీ ప్రభుత్వం బలప్రయోగంతో ప్రజల గొంతులను నొక్కలేదని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) నిజామాబాద్ రూరల్ కామారెడ్డి సంయుక్త జిల్లా కమిటీ కార్యదర్శి వి. ప్రభాకర్, నాయకుడు బి. దేవారాం అన్నారు. నగరంలోని కుమార్ నారాయణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనకారులపై పోలీసు బలగాలు జరిపిన అమానుష దాడులను, అరెస్టులను వారు తీవ్రంగా ఖండించారు. స్వతంత్రంగా వ్యవహరించకుండా ప్రజాస్వామ్య సూత్రాలను ఉల్లంఘిస్తున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని లేదా ఆయనను పదవి నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ నాయకులు ఎం. ముత్తెన్న, యు.రాజన్న, అరవింద్, పీడీఎస్‌యూ నాయకులు నిఖిల్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించాలి



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ : బతుకమ్మ సంబరాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని 27వ డివిజన్ కార్పొరేటర్ కల్పె అర్చన చిరంజీవి పేర్కొన్నారు. నగరంలోని సెయింట్ జేవియర్స్ స్కూల్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కల్పె అర్చన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో బతుకమ్మ పండుగకు ఎంతో విశిష్టత ఉందన్నారు. అలాగే దసరా ఉత్సవాలు ఎందుకు జరుపుకుంటారో కూడా విద్యార్థులకు వివరించారు. అనంతరం సంబరాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్కూల్ అధినేత సంజీవ్‌రావు, హెడ్‌మాస్టర్ లత, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలి



అక్షరటుడే, ఇందూరు: ప్రభుత్వ పథకాలు పొందేందుకు అర్హులైన పేదలు దరఖాస్తులు చేసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. తెలంగాణ సిక్కు సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య శిబిరం నిర్వహించగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు పొందేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పేదలైన సిక్కులకు ఇళ్లు అందేలా తన వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఆరోగ్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. పేదలకు ఇలాంటి శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. అందరూ ఐకమత్యంతో ఉంటూ ప్రభుత్వ పథకాలు పొందాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలకు తన వంతు సహాయం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సిక్కు సొసైటీ అధ్యక్షురాలు తేజ్ దీప్ కౌర్, అర్బనైజింగ్ సెక్రెటరీ దర్శన్ సింగ్ సోకి, బీజేపీ కార్పొరేటర్ మఠం పవన్, పవన్ ముందడ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

స్తంభంపై కేబుల్ టీవీ లైన్‌మన్‌కు కరెంట్ షాక్

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: స్తంభం ఎక్కి కేబుల్ వైర్లను సరిచేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి లైన్‌మన్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన నగరంలోని ముబారక్ నగర్‌లో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. నగరంలోని ముబారక్‌నగర్‌లో పెద్దమ్మ ఆలయానికి వెళ్లే మార్గంలో ఓ స్తంభంపై కేబుల్ టీవీ లైన్‌మన్ కేబుల్ వైర్లు సరి చేస్తున్నాడు. ఈ క్రమంలో అతడు స్తంభంపై విద్యుత్‌వైర్లకు తగలడంతో షాక్‌కు గురై కిందపడ్డాడు. దీంతో అతడి చేతికి గాయాలయ్యాయి. రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరగడంతో పోలీసులు సమాచారం సేకరిస్తున్నారు. ప్రస్తుతం క్షతగాత్రుడిని జీజీహెచ్‌కు తరలించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

అక్షరటుడే, నిజామాబాద్ క్రైం: ఇంట్లో విద్యుత్ మీటర్‌కు మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన నగరంలోని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అంబేద్కర్ కాలనీలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. అంబేద్కర్ కాలనీకి చెందిన కరసం చంద్రశేఖర్(42) కూలీ పనిచేస్తుండేవాడు. ఆదివారం మధ్యాహ్నం తన ఇంట్లో ఉన్న విద్యుత్ మీటర్‌కు మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలింది. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిజామాబాద్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో టీవీ దగ్ధం



అక్షరటుడే, ఎల్లారెడ్డి : మున్సిపాలిటీ పరిధిలోని గండిమాసానిపేటలో శనివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో గ్రామానికి చెందిన జంగా నర్సింలు ఇంట్లోని టీవీ దగ్ధమైంది. గ్రామ పరిధిలో విద్యుత్ వైర్లు చెట్టు కొమ్మలకు తగలడంతో ట్రాన్స్ ఫార్మర్ వద్ద మంటలు చెలరేగినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రభావంతో సమీపంలోని జంగ నర్సింలు ఇంట్లో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి టీవీ కాలిపోయినట్లు పేర్కొన్నారు. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ప్రాణనష్టం జరగకపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదం కారణంగా సుమారు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న ట్రాన్స్ కో అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. గ్రామాల్లో విద్యుత్ వైర్లు చెట్ల కొమ్మలకు తగలకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భారీ వాహనాలకు అనుకూలంగా డ్రైనేజీ నిర్మించాలి



అక్షరటుడే, ఎల్లారెడ్డి: పట్టణంలోని రెండో వార్డు న్యూ ఆబాదిలో రహదారులు, వాణిజ్య సముదాయాలు ఉండటంతో నిత్యం భారీ సరుకు రవాణా వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్‌హెచ్ఐఐ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను భారీ వాహనాలు సైతం సులభంగా రాకపోకలు సాగించేలా చేపట్టాలని రెండో వార్డు కౌన్సిలర్ మహేశ్వరి విద్యాసాగర్, వినోద్ కోరారు. ఈ మేరకు జాతీయ రహదారి పనుల మేనేజర్‌ను కలిసి డ్రైనేజీ నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. భారీ వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, డ్రైనేజీపై నిర్మించే క్రాసింగ్‌లు పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు, వ్యాపారులకు ఉపయోగపడేలా అభివృద్ధి పనులు ప్రణాళికాబద్ధంగా చేపట్టి, భవిష్యత్తులో మరమ్మతుల అవసరం రాకుండా పటిష్టమైన నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.